మరో కౌలు రైతు ఆత్మహత్య

- దిగుబడులు రాక, అప్పులు తీర్చలేక
- భూపాలపల్లి జిల్లాలో రైతు బలవన్మరణం

రాజబాపు (ఫైల్)

మహదేవపూర్ (కాటారం), అక్టోబర్ 6: దిగుబడులు రాక, అప్పులు తీర్చలేక మరో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో ఆదివారం జరిగింది. ఎస్సై అభినవ్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కొండ రాజబాపు(45) పలిమెల గ్రామంలో భూమి కౌలు తీసుకొని పత్తి పంట సాగు చేశాడు. రెండేండ్లల్లో అధిక వర్షాల కారణంగా పంట నష్టం జరిగింది. సరైన దిగుబడి రాక రూ.7 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో కాటారానికి వచ్చి మళ్లీ 4 ఎకరాలు కౌలుకు తీసుకొని పత్తి సాగుచేయగా, నష్టం రావడంతో రూ.3 లక్షల అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక తీవ్ర మనోవేదనతో రాజబాపు గురువారం రాత్రి గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహదేవపూర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు ఎస్సై తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో ఇద్దరు చిన్నారులు మృతి

- బతుకమ్మ పూలు కోస్తుండగా ఒకరు
- ఫ్యాన్ వైరును పక్కకు తొలగిస్తుండగా మరొకరు..

రఘునాథపాలెం/ గుండాల, అక్టోబర్ 6: వేర్వేరు చోట్ల విద్యుదాఘాతానికి గురై ఇద్దరు చిన్నారులు మృతిచెందిన ఘటనలు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆదివారం చోటుచేసుకున్నాయి. ఖమ్మం రఘునాథపాలెం మండలం పాపటపల్లికి చెందిన మిట్టపల్లి చరణ్ తేజ్(15) పదో తరగతి చదువుతున్నాడు. బతుకమ్మ వేడుక కోసమని టేకు చెట్టు పైన ఉన్న పూలు కోసేందుకు డాబా పైకి ఎక్కాడు. పూలు కోస్తుండగా, పక్కనే ఉన్న విద్యుత్తు లైన్‌కు చేయి తగలడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. అలాగే, భద్రాద్రి జిల్లా గుండాల మండలం వెన్నెలబైలుకు చెందిన ఇర్ప సువర్ణ (12) ఇంటి రేకులకు ఉన్న ఫ్యాన్ వైరును పక్కకు తొలగించబోయింది. ఆ వైరును ఎలుకలు కొరికివేయడంతో దీనిని గమనించకుండా పట్టుకోవడంతో షాక్ తగలడంతో కుప్పకూలింది. దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందింది.

గుండెపోటుతో ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్ మృతి

రమేశ్ సింగ్, రాకం లింగమూర్తి (ఫైల్)

హుజూరాబాద్ టౌన్/చిగురుమామిడి, అక్టోబర్ 6: విధినిర్వహణలో ఉన్న ఇద్దరు ఆర్టీసీ ఉద్యోగులు గుండెపోటుతో మృతిచెందారు. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం దుద్దెనపల్లికి చెందిన ఠాకూర్ రమేశ్‌సింగ్ (45) హుజూరాబాద్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. 15 రోజుల క్రితమే పరకాల డిపో నుంచి డిప్యూటేషన్‌పై హుజురాబాద్‌కు వచ్చారు. ఆదివారం హుజూరాబాద్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా గజ్వేల్ సమీపంలోకి రాగానే గుండెపోటుకు గురయ్యారు. దీంతో బస్సును పక్కకు ఆపి కండక్టర్, ప్రయాణికులకు చెప్పారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వచ్చి రమేశ్ సింగ్‌ను గజ్వేల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అలాగే.. చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన రాకం లింగమూర్తి (55) కరీంనగర్-2 డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం బస్టాండ్‌కు వచ్చి బస్సు వద్దకు వెళ్తుండగా ఛాతీలో నొప్పి రావడంతో కుప్పకూలిపోయాడు. వెంటనే ఆర్టీసీ సిబ్బంది కరీంనగర్‌లోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు.

పంచాయతీలకు నిధుల కటకట!

రోజువారీ పనులకు కూడా డబ్బుల్లేవు

- పడకేసిన పారిశుద్ధ్యం.. జ్వరాల విజృంభణ
- దాదాపు 4 వేల కోట్లు విడుదలచేయని సర్కార్
- అప్పులు చేయాల్సిన దుస్థితిలో కార్యదర్శులు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): గ్రామ పంచాయతీలు ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని నెలలుగా నిధులు విడుదల చేయకపోవడంతో పల్లెలను నిధుల కొరత వేధిస్తున్నది. ఆదాయ వనరులు అంతగా లేని పంచాయతీల్లో కనీసం కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని దుస్థితి నెలకొన్నది. దీంతో పంచాయతీ కార్యదర్శులు అప్పులు చేసి అత్యవసర ఖర్చులకు సర్దుబాటు చేయాల్సి వస్తున్నది. అభివృద్ధి పనుల మాట దేవుడెరుగు.. కనీసం వేతనాలు, కరెంటు బిల్లులు, ఈఎంఐ లకైనా నిధులు ఇవ్వండి మహాప్రభో అని వేడుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిధులు లేక గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త సేకరించే ట్రాక్టర్లకు కనీసం డీజిల్ కూడా పోసే పరిస్థితి లేకపోవడంతో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతున్నది. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రతి ఇంట్లో ఒకరిద్దరు దవాఖాన పాలవుతున్నారు. గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛదనం, పచ్చదనం, బతుకమ్మ, దసరా పండగ సంబరాలకు నిధుల లేమి సమస్యగా మారిందని పంచాయతీ కార్యదర్శులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నాడు ఎట్లుండె.. నేడు ఏమైంది?

గత బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు అత్యంత ప్రాధాన్యమిచ్చింది. కేంద్రం నుంచి వచ్చే నిధులకు అంతే మొత్తంలో జమ చేసి నెలకు రూ.250 కోట్లకుపైగా గ్రామ పంచాయతీలకు విడుదల చేసేవారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు సాఫీగా జరిగేవి. గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో చూడముచ్చటగా ఉండేవి. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. నిధుల విడుదల ఆగిపోవడంతో అన్ని పనులు బంద్ అయ్యాయి. గత పది నెలల్లో పంచాయతీలకు దాదాపు రూ.2,500 కోట్లు, ఉపాధి హామీ పథకం కింద దాదాపు మరో రూ.1,300 కోట్ల నిధులు విడుదల కావాల్సి ఉన్నదని మాజీ సర్పంచ్‌లు చెప్తున్నారు. తాము అనేకసార్లు ప్రభుత్వాన్ని, గవర్నర్‌ను, ప్రతిపక్షాలను కలిసినా ఫలితం లేదని మాజీ సర్పంచ్‌లు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులే చిన్నచిన్న పనులకు కూడా నిధులు లేకపోవడంతో వ్యక్తిగతంగా అప్పులు తెచ్చి పెడుతున్నారు. ప్రభుత్వం నిధుల విడుదలలో జాప్యం చేస్తుంటే వాటిని ఎలా తీర్చాలోనని మథనపడుతున్నారు.

గాడి తప్పిన పాలన

> సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం ఫిబ్రవరి 2న ప్రత్యేకాధికారులను నియమించింది. నిధుల లేమి, సిబ్బంది జీతాల చెల్లింపుల్లో జాప్యం కారణంగా పంచాయతీ పాలన గాడితప్పుతున్నది. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనుల కోసం బ్లీచింగ్ పౌడర్, చెత్త సేకరణ, మురుగు కాలువల్లో పూడికతీత, విద్యుత్తు దీపాల ఏర్పాటు, తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు, ట్రాక్టర్లకు డీజిల్ కొరత తదితర సమస్యలు రాజ్యమేలుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. ప్రత్యేకాధికారులు సైతం చేసేదేమీ లేక పంచాయతీలను పెద్దగా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

నేటి నుంచి ఎడ్‌సెట్ స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్

- 11న సీట్ల కేటాయింపు
- 14 నుంచి 17 వరకు రిపోర్టింగ్‌కు అవకాశం

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): రెండేండ్ల బీఈడీ కోర్సులో భారీగా సీట్లు మిగలడంతో మరో విడుత కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. ఎడ్‌సెట్ స్పెషల్ ఫేజ్ కౌన్సెలింగ్ నేటి(సోమవారం)నుంచి ప్రారంభంకానున్నది. సోమవారం రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశముండగా, సోమ, మంగళవారాల్లో వెబ్ ఆప్షన్లు ఎంచుకోవచ్చు. 8న వెబ్ ఆప్షన్లను ఎడిట్ చేసుకోవచ్చు. 11న సీట్లను కేటాయింపు ఉంటుందని, 14 నుంచి 17 వరకు కళాశాలల్లో రిపోర్టు చేయాలని అధికారులు పేర్కొన్నారు.

9న కొత్త టీచర్లకు నియామకపత్రాలు

- సాయంత్రం 4 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి అందజేత
- నేటి సాయంత్రంలోగా కలెక్టరేట్లకు ఎంపిక జాబితాలు
- పాల్గొననున్న 10 వేల మందికి పైగా అభ్యర్థులు
- జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లు
- టెలి కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతికుమారి వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 9న ఎల్బీ స్టేడియంలో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాలను అందజేయనున్నట్టు సీఎస్ శాంతికుమారి వెల్లడించారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై సీఎస్ ఆదివారం సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో దాదాపు 10 వేల మందికి పైగా అభ్యర్థులు పాల్గొంటారని చెప్పారు. ఇప్పటికే డీఎస్సీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయిందని, సోమవారం సాయంత్రంలోగా తుది జాబితాలను జిల్లా కలెక్టర్లకు పంపుతామని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులంతా ఎల్బీ స్టేడియానికి చేరుకునేలా చూడాలని, బస్సులు సహా అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఎల్బీస్టేడియంలో అభ్యర్థులకు నియామక పత్రాలిచ్చేందుకు జిల్లాల వారీగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం, నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్, అడిషనల్ డీజీ మహేశ్ భగవత్, ఆర్ అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి హరిచందన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఈవీ నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఆర్డర్లకు ఆలస్యం?

డీఎస్సీ అభ్యర్థులకు ఇప్పటికిప్పుడు నియామక పత్రాలిచ్చినా పోస్టింగ్‌కు కొంత సమయం పట్టనున్నది. వెంటనే పోస్టింగ్ ఇస్తే జీవో 317 బాధితులకు తీరని అన్యాయం జరుగుతుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. డీఎస్సీ ఉద్యోగాల ఎంపిక ప్రక్రియలో దివ్యాంగ కోటా అభ్యర్థులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తంచేస్తున్నారు. మెడికల్ బోర్డును నియమించకుండా, సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించకుండా ఇష్టారీతిన చేస్తున్నారని అభ్యర్థులు మండిపడుతున్నారు. గురుకుల బోర్డు, టీజీపీఎస్సీ తరహాలో పకడ్బందీగా వెరిఫికేషన్ చేపట్టడంలేదని ఆరోపిస్తున్నారు. మెడికల్ బోర్డును నియమించి, పరీక్షలు నిర్వహించిన తర్వాతే దివ్యాంగుల కోటా ఉద్యోగాలను భర్తీచేయాలని తెలంగాణ సమీకృత వికలాంగుల సంఘం నేతలు ప్రభుత్వాన్ని కోరారు.

దక్షిణ బంగాళాఖాతంలో ఆవర్తనం

మరో మూడు రోజులు వర్షాలు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): దక్షిణ బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తనం కారణంగా ఆదివారం నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షంతో పాటు గంటకు 30-40కి.మీ వేగంతో బలమైన ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నట్టు వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. జోగులాంబ-గద్వాల,రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడి, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీ చేశారు. నేడు మేడ్చల్-మల్కాజిగిరి,భూపాలపల్లి, హైదరాబాద్, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, సిద్దిపేట, యాదాద్రి, రంగారెడ్డి,వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, జనగామ, నాగర్‌కర్నూల్, నారాయణపేట, వరంగల్, హనుమకొండ, వనపర్తి జిల్లాల్లో వర్షాలు కురుస్తాయన్నారు. గడిచిన 24 గంటల్లో జనగామలో అత్యధికంగా 3.40 సెం.మీ, జోగులాంబ-గద్వాల జిల్లా రాజోలిలో 3.06 సెం.మీ, రాజన్న -సిరిసిల్ల జిల్లా వేములవాడలో 2.52 సెం.మీ, జనగామ జిల్లా బచ్చన్నపేటలో 2.45 సెం.మీ, కామారెడ్డి జిల్లా పిట్లంలో 2.27 సెం.మీ, రామారెడ్డిలో 2.06 సెం.మీ, లింగంపేటలో 1.96 సెం.మీ, పాల్వంచలో 1.87 సెం.మీ, సంగారెడ్డి జిల్లా కంగ్టిలో 2.11 సెం.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్టు తెలిపారు.

జేఎల్ సంఘం అధ్యక్షుడిగా మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్(జీజేఎల్ఏ) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి మరోసారి ఎన్నికయ్యారు. సంఘం మూడో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను ఆదివారం హైదరాబాద్‌లో నిర్వహించగా, ఇప్పటికే రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగుతున్న ఆయన్నే మరోసారి ఎన్నుకున్నారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సమావేశానికి హాజరై మాట్లాడారు. అనంతరం రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంఘం ప్రధాన కార్యదర్శిగా బలరాం జాదవ్, అసోసియేట్ అధ్యక్షుడిగా ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా ఎస్ శ్రీనివాస్, జీ సత్యపాల్‌రెడ్డి, జీ వేణుగోపాల్, టీ శ్రీధర్, ఎన్ రమేశ్, వీ అశోక్, సంయుక్త కార్యదర్శిగా ఎం విజయశేఖర్, ఆర్థిక కార్యదర్శిగా ఏ శివప్రసాద్, మహిళా కార్యదర్శిగా ఎస్ పద్మావతి, రాష్ట్ర కార్యదర్శులుగా వీ ప్రమీల, ఏఏవీ ప్రసాద్, ఎం హరిప్రసాద్, ఫహీముద్దీన్, జీ మధు, కే శ్రీదేవిని ఎన్నుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు 7.5శాతం నిధులు కేటాయించడంపై సమావేశం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేసింది. రాష్ట్రంలో 10+2+3 విద్యా విధానాన్ని యాథావిధిగా కొనసాగించి, ఇంటర్ విద్య అస్తిత్వాన్ని గుర్తించాలని డిమాండ్ చేసింది. ఇంటర్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం, మధ్యాహ్న భోజనాన్ని అందించాలని కోరింది.

గురుకుల పనివేళలు మార్చండి

- మెస్‌చార్జీలను పెంచాలి
- జేఏసీ నేతలు డిమాండ్

హైదరాబాద్, అక్టోబర్6 (నమస్తే తెలంగాణ): గురుకుల పనివేళలను ప్రభుత్వం వెంటనే మార్చాలని గురుకుల సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. జేఏసీ నేతలు మామిడి నారాయణ, డాక్టర్ మధుసూదన్, నరసింహులు గౌడ్, గణేశ్, భిక్షంయాదవ్, వేదంతాచారి ఆదివారం సంయుక్త ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో 662 వరకు గురుకుల పాఠశాలలు అద్దె భవనాల్లోనే ఉన్నాయని, విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వమే అంగీకరిస్తున్నదని తెలిపారు. ఇటీవల ప్రభుత్వం మార్చిన పనివేళలు విద్యార్థులు, ఉపాధ్యాయుల సమస్యలను మరింత తీవ్రం చేస్తున్నదని వెల్లడించారు. గతంలో మాదిరిగా పనివేళలను ఉదయం 9 నుంచి 4:30 గంటల వరకు పునరుద్ధరిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇంటిగ్రేటెడ్ గురుకులాల ఏర్పాటును స్వాగతిస్తున్నామని, అయితే ప్రస్తుతం విద్యార్థులకు అందిస్తున్న మెస్‌చార్జీలను పెంచాలని కోరారు. అనేక సమస్యలను ప్రభుత్వానికి నివేదించామని, అయినప్పటికీ స్పందన లేదని వాపోయారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు స్పందించి గురుకుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

జలపాతంలో మునిగి బీటెక్ విద్యార్థి మృతి

వాజేడు, అక్టోబర్ 6 : ములుగు జిల్లా వాజేడు మండలం కొంగాల అటవీ ప్రాంతంలోని దూసపాటిలోద్ది (విఫాల్స్) జలపాతంలో మునిగి బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన బండారు అభినవ్ (19) స్నేహితులతో కలిసి శనివారం వాజేడు మండలానికి వచ్చారు. రాత్రి చీకుపల్లిలో బస చేశారు. ఆదివారం ఉదయం కొంగాల అడవిలోని దూసపాటిలోద్ది (విఫాల్స్) జలపాతం వద్దకు వెళ్లారు. ఈ క్రమంలో జలపాతం వద్ద ఉన్న నీటిలోకి దిగిన అభినవ్ ప్రమాదవశాత్తు నీట మునిగాడు. స్నేహితుల సమాచారంతో అక్కడికి చేరుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈతగాళ్ల సాయంతో అభినవ్ మృతదేహాన్ని బయటికి తీసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏటూరు నాగారం వైద్యశాలకు తరలించారు.

శ్రావణి, కూకర్ల రాజు (ఫైల్)

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

ఐనవోలు, అక్టోబర్ 6 : హనుమకొండ జిల్లా ఐనవోలు మండలం వెంకటాపురం గ్రామంలో ఆదివారం పిడుగుపాటుకు ఇద్దరు మృతి చెందగా, మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షి దౌతుబాజి విజయ కథనం ప్రకారం.. ఐనవోలు మండలం వెంకటాపురంలోని కట్టు కాల్వ వైపు ఉన్న వ్యవసాయ భూముల్లో కొందరు పనులు చేస్తున్నారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఉరుములు మెరుపులతో భారీ వర్షం ప్రారంభం కావడంతో చేన్లలో పనులు చేస్తున్న పలువురు ఎద్దుల కోసం వేసిన రేకుల దొడ్డిలోకి వెళ్లారు. ఈ క్రమంలో ఒక్కసారిగా పిడుగు పడింది. దొడ్డిలో ఉన్న ఏడుగురు కింద పడిపోయారు. కొద్ది సేపటి తర్వాత లేచి చూసేసరికి దౌతుబాజి శ్రావణి(17), కూకట్ల రాజు(24) మృతి చెందారు. రాజు తల్లి కోమలతోపాటు నలుగురు అస్వస్థతకు గురయ్యారు.

పాలసీనే లేదు.. కొనుగోళ్లు ఎలా?

మొదటిపేజీ తరువాయి...

ఒప్పందాలు చేసుకోలేదు. మరోవైపు తమ సమస్యలు పరిష్కరించే వరకు ధాన్యం దించుకునేది లేదంటూ మిల్లర్లు ఇప్పటికే అల్టిమేటం జారీ చేశారు. కొనుగోళ్లపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా పూర్తిస్థాయిలో డైరెక్షన్ ఇవ్వలేదని తెలిసింది. పై స్థాయిలో ఒప్పందాలు, క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు చేయకుండా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభిస్తామంటూ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలపై విమర్శలొస్తున్నాయి.

పాలసీ రూపొందించడంలో జాప్యం

ఏటా ధాన్యం కొనుగోళ్లపై భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)తో రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఒప్పందం కుదుర్చుకుని పాలసీని రూపొందిస్తుంది. సాధారణంగా ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో పాలసీని రూపొందిస్తారు. ఎంత ధాన్యం కొనుగోలు చేయాలి? ఎన్ని కేంద్రాలు ఏర్పాటు చేయాలి? మిల్లర్లకు, సీఎమ్మార్‌కు ఎలాంటి నిబంధనలు విధించాలి? తదితర అంశాలు ఈ పాలసీలో ఉంటాయి. కానీ, అక్టోబర్ మొదటి వారం పూర్తయి, ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించే సమయం వచ్చినా, పాలసీని రూపొందించలేదు. మరోవైపు కొనుగోళ్లకు ఏర్పాట్లు పూర్తిచేశామంటూ అధికారులు ప్రకటిస్తున్నారు. ఈ నేపథ్యంలో అసలు పాలసీ లేకుండా ధాన్యం కొనుగోళ్లు ఏ విధంగా చేస్తారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వానికి, పౌరసరఫరాల సంస్థకు ధాన్యం కొనుగోళ్లపై ముందస్తు ప్రణాళిక లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మిల్లర్లతో ఒప్పందాల సంగతేంటి?

రైతుల నుంచి ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవాల్సి ఉంటుంది.

ఇందుకోసం పౌరసరఫరాల సంస్థ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మిల్లర్లతో ఒప్పందాలు చేసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఇప్పటివరకు మిల్లర్లతో ఒప్పందం చేసుకోలేదు. దీంతో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎవరు దించుకుంటారు? ఎక్కడ నిల్వ చేస్తారు? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. సన్న ధాన్యానికి సంబంధించి అవుట్‌టర్న్ రేషియోను తేల్చే వరకు తాము ధాన్యాన్ని దించుకోబోమని మిల్లర్లు తెగేసి చెప్పున్నారు. నిబంధనల ప్రకారం ధాన్యం నుంచి 67% బియ్యం రావడం కష్టమని, 60% వరకే వస్తాయని మిల్లర్లు చెప్తున్నారు. మిగిలిన నష్టానికి ఎవరు బాధ్యులు, ఏం చేయాలో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఈ వివాదంపై స్పందించలేదు. దీంతో మిల్లర్లు కూడా బెట్టుదిగడం లేదు. 'మేము దిగొస్తామని అధికారులు అనుకుంటున్నారేమో. ఆ పరిస్థితి అసలే లేదు. మేము నష్టాలను భరిస్తూ ప్రభుత్వానికి మేలు చేయాలా? అలా చేస్తే మా బతుకులు రోడ్డుపాలు కావడం ఖాయం' అని ఒక మిల్లరు వ్యాఖ్యానించడం గమనార్హం. తాము నెల నుంచి సమస్యను అధికారుల దృష్టికి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తున్నామని, కానీ, స్పందన లేదని చెప్పారు. ఒకవేళ ధాన్యం దించుకోవడంలో ఇబ్బందులు ఎదురైతే, తమను బాధ్యులను చేస్తే మాత్రం సహించేది లేదని హెచ్చరించారు. గతంలో జిల్లా అసోసియేషన్ ఆ జిల్లాలోని మిల్లర్లకు బాధ్యత వహిస్తూ లెటర్ ఇచ్చేది. కానీ ఈ సీజన్ నుంచి జిల్లా అసోసియేషన్ తరుపున మిల్లర్లకు లెటర్లు ఇవ్వొద్దని నిర్ణయించినట్టు తెలిసింది. మిల్లర్లు ఎవరికి వారే సొంతంగా సివిల్ సప్లైకి గ్యారంటీ ఇవ్వాల్సి ఉంటుంది.

కేంద్రాలెక్కడ.. కొనుగోళ్లేవి?

అక్టోబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోళ్లను ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై గత నెల 23న ఎంసీఆర్ హెచ్‌ఆర్డీలో జిల్లాల జాయింట్ కలెక్టర్లు, సివిల్ సప్లై అధికారులతో సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ మొదటి వారంలో నల్లగొండ, మెదక్ జిల్లాల్లో, రెండో వారంలో నిజామాబాద్, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కానీ మొదటి వారం పూర్తయినా రాష్ట్రంలో కనీసం ఒక్క కొనుగోలు కేంద్రమైనా ఏర్పాటు చేయకపోవడం గమనార్హం. దసరా తర్వాత ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్తున్నట్టు తెలిసింది. మరోవైపు పలు జిల్లాల్లో వరి కోతలు మొదలయ్యాయి. దీంతోపాటు వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలకే పరిమితం కాకుండా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం వద్దు..

- టిఫిన్ బాక్స్‌లే ముద్దు
- 32శాతం విద్యార్థుల్లో విముఖత
- ఏటా తగ్గుతున్న విద్యార్థుల సంఖ్య
- ఆందోళన వ్యక్తంచేసిన కేంద్రం
- నివేదికను సమర్పించాలని ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబర్ 6 (నమస్తే తెలంగాణ): సర్కారు స్కూళ్లల్లో 32శాతం విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినడం లేదు. ఇంటినుంచి టిఫిన్‌బాక్స్‌లు తెచ్చుకుని కడుపు నింపుకుంటున్నారు. పట్టణ ప్రాంతాల వారే కాకుండా.. మారుమూల జిల్లాల్లోని విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని ముట్టడంలేదు. ఏటా వీరి సంఖ్య తగ్గుతుండటంతో కేంద్రం గతంలో 2.25 లక్షల మందికి కోతపెట్టింది. 2022-23తో పోల్చితే 2023-24లో ఏకంగా 3.71లక్షల విద్యార్థులు మధ్యాహ్న భోజనాన్ని తినడం మానేశారు. ఇందుకు గల కారణాలను అన్వేషించి, సమ్రగ నివేదికను రూపొందించి అందించాలని రాష్ట్ర విద్యాశాఖకు కేంద్రం సూచించింది. అడవుల జిల్లా అయిన ములుగు, అర్బన్ జిల్లా అయిన హైదరాబాద్‌లో ప్రాథమిక పాఠశాలల్లో 60శాతం విద్యార్థులు మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని తింటుండగా, పెద్దపల్లి, మంచిర్యాల, భద్రాద్రి కొత్తగూడెం, మేడ్చల్ జిల్లాల్లో ప్రాథమికోన్నత పాఠశాలల్లోని వారు 60శాతంలోపే స్వీకరిస్తుండటం ఆందోళనకరం. కాగా, రాష్ట్రంలో 27,008 స్కూళ్లుండగా, ఇప్పటి వరకు 3,985 స్కూళ్లకు (15శాతం)మాత్రమే ఎల్‌పీజీ కనెక్షన్లున్నాయి. మిగతా బడుల్లో కట్టెల పొయ్యిలపైనే వంట చేస్తున్నారు. అన్ని బడులకు ఎల్‌పీజీ కనెక్షన్లు అందజేయాలని కేంద్రం సూచించింది.

ఉపాధ్యాయ సంఘాల సూచనలు

- గురుకులాలు, హాస్టళ్లు, సర్కారు స్కూళ్లల్లో కామన్ మెనూను రూపొందించి అమలుచేయాలి.
- కేజీబీవీ, గురుకులాల తరహాలో వంట సరుకులను ప్రభుత్వమే టెండర్ల ద్వారా అ